‘ఉడ్ కట్’లో శభాష్ బాబు!

- ఆ కళలో నిపుణుడు రావూరి సుభాష్‌బాబు
- చిత్రకళా ఉపాధ్యాయుడిగా వృత్తిజీవితం
- శాండ్ క్యాస్టింగ్, మ్యూరల్ పెయింటింగ్ లోనూ ప్రతిభ
- భారత ప్రభుత్వ సీనియర్ ఫెలోషిప్‌తో అధ్యయనం
- తెనాలిలో నేడు ‘దర్శనాచార్య’ కొండూరు వీరరాఘవాచార్యులు పురస్కారం ప్రదానం సందర్భంగా ప్రత్యేక కథనం



సుభాష్‌బాబు వేసిన పెయింటింగ్ , ఉడ్ కట్ చిత్రం

తెనాలి: దర్శనాచార్య, కళాప్రపూర్ణగా ప్రసిద్ధులైన తెనాలికి చెందిన కొండూరు వీరరాఘవాచార్యులు, అయిదున్నర దశాబ్దాలపాటు శిల్ప, సాహిత్య, తత్వావాఙ్మయ సేవ చేశారు. తెలుగు, సంస్కృతంలో రచనలు చేశారు. వేదాధ్యయనం చేశారు. యోగం అనుష్టించారు. వేదాంతం ప్రవచించారు. శిల్పశాస్త్ర మర్మాలను ఆవిష్కరించారు. వేదాంతానికి శిల్పం జోడించి చెప్పగలిగారు. దర్శన సాహిత్యానికొక కొత్త ఒరవడి దిద్దారు. అంతటి మహానుభావుడి స్మారకార్థం శిల్ప, చిత్ర, కళా రంగాల్లో ప్రముఖులకు ఏటా అవార్డును ప్రదానం చేస్తున్నారు. 2025 సంవత్సరానికి ఈనెల 26న సాయంత్రం స్థానిక శాఖాగ్రంథాలయంలో ఏర్పాటయ్యే ప్రత్యేక సభలో ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబుకు డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు ధర్మనిధి పురస్కారం అందజేయనున్నారు. ఈ సందర్భంగా సుభాష్‌బాబు పరిచయం.


రావూరి సుభాష్‌బాబు

- సుభాష్‌బాబు ఉమ్మడి గుంటూరు జిల్లా రేటూరులో 1944 డిసెంబరు 22న జన్మించారు. తల్లిదండ్రులు కామేశ్వరమ్మ, నాగభూషణాచార్యులు. పచ్చలతాడిపర్రులో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివారు. చిత్రకళా ఉపాధ్యాయుడైన తండ్రి కళావారసత్వం సహజంగా అబ్బిందేమో... సుభాష్‌బాబు కూడా చిత్రకళకేసి చూశారు. హైదరాబాద్‌లోని ఫైనార్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ కాలేజీలో అయిదేళ్ల డిప్లొమా కోర్సు (1963–68) చేశాడు. లలిత కళా అకాడమీ స్కాలర్‌షిప్‌తో బరోడా యూనివర్శిటీలో మ్యూరల్ పెయింటింగ్, శాండ్ క్యాస్టింగ్ కళాప్రక్రియలను అధ్యయనం చేశాడు. 1970లో హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ఆర్ట్ టీచర్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. 2004లో రిటైరయ్యారు.
- ఉపాధ్యాయుడిగా విద్యార్థులను చిత్రకళలో తీర్చిదిద్దుతూనే, చిత్రకళా రచనను కొనసాగిస్తూ వచ్చారు. అద్దంలో తనను తాను చూసుకుంటూ వాటర్ కలర్స్‌తో చిత్రించిన ‘సెల్ఫ్ పోర్ట్రయిట్’కు 1970లోనే లలిత కళాఅకాడమీ అవార్డును అందుకున్నారు సుభాష్‌బాబు. వాటర్ కలర్స్, అక్రిలిక్ పెయింటింగ్స్‌తోపాటు మ్యూరల్ పెయింటింగ్, శాండ్ కాస్టింగ్ కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. వీటితోపాటు ఉడ్‌కట్ పెయింట్‌లోనూ ప్రతిభను చాటసాగారు. భారతదేశంలోని వివిధ పట్టణాలు, నగరాల్లో నిర్వహించిన చిత్రకళా పోటీలు/ప్రదర్శనలు, సదస్సులు, వర్క్‌షాపుల్లో పాల్గొంటూ వచ్చారు. ఆ క్రమంలోనే హైదరాబాద్ ఆర్ట్ సొసైటీకి సుదీర్ఘకాలం కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, కోశాధికారిగా పనిచేశారు.

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని పర్యాటక, సాంస్కృతిక శాఖ 2011–13లో సుభాష్‌బాబుకు సీనియర్ ఫెలోషిప్‌నిచ్చి మరింతగా ప్రోత్సహించింది. దీంతో గ్రాఫిక్స్, ఉడ్ కట్ ప్రింటింగ్‌లో మరింత నైపుణ్యాన్ని సాధించి, కళాఖండాలను తీర్చిదిద్దారు. ప్లై వుడ్ ప్యానర్‌పై చిత్రాలను గీసి, కత్తిరించి, రంగులద్ది, కాగితంపై ప్రింట్ చేయటమే ఉడ్‌కట్ ప్రింటింగ్ ప్రక్రియ. దీనిలో సుభాష్‌బాబు అద్భుతాలను సృష్టించారు. వీరు రూపొందించిన ఉడ్‌కట్ ప్రింటింగ్ ఒకదానిని హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం కొనుగోలు చేసి, తన కాంటెంపరరీ ఆర్ట్ గ్యాలరీలో ఉంచింది. తాను పనిచేసిన బేగంపేట పబ్లిక్ స్కూల్ సుందరీకరణలో భాగంగా శాండ్ కాస్టింగ్ మ్యూరల్స్, సిమెంటు బొమ్మలను తీర్చిదిద్దారు. చిత్రకారుడిగా, మ్యూరలిస్ట్‌గా, ఉపాధ్యాయుడిగా అయిదు దశాబ్దాల కృషికి గుర్తింపుగా సుభాష్‌బాబు పలు విశిష్ట గౌరవాలనూ అందుకున్నారు. 2009లో తెలుగు యూనివర్శిటీ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉగాది, కళారత్న గౌరవాలనూ స్వీకరించారు. మళ్లీ ఇప్పుడు ‘దర్శనాచార్య కొండూరు’ పురస్కారాన్నీ అందుకోనున్నారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అత్యావశ్యకం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంట కార్యక్రమాన్ని టిడ్కో గృహ సముదాయం వద్ద గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిరోజు వీధులను శుభ్రం చేయటంతో పాటు కాల్వల్లో పూడికతీత పనులు జరిగేలా చూస్తున్నామన్నారు. కాల్వల్లో ఎటువంటి వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ముందుగా రోడ్లు ఊడ్చి, పిచ్చి మొక్కలు తొలగించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు గుమ్మడి ప్రసాద్, టీవీఎస్ ప్రసాద్, అనుపమ, సచివాలయ ఉద్యోగులు, నగర దీపికలు పాల్గొన్నారు.

అక్టోబరు 10,11 తేదీల్లో కలశ ప్రతిష్టాపన

తెనాలి: పట్టణ నాజర్‌పేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అభయ వీరాంజనేయస్వామి దేవాలయంలో తూర్పు వైపున నూతనంగా నిర్మించిన గాలిగోపురం, కలశ ప్రతిష్టాపన అక్టోబరు 10,11 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ చైర్మన్ కె.చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. 11వ తేదీ ఉదయం 9.09 గంటలకు శ్రీ శృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠ పాలిత శ్రీపరశివానంద భారతిస్వామిచే ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రతిష్ట 1906లో జరిగిందని, అప్పటినుంచి ఇప్పటివరకు స్వామివారు నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్నారని, భక్తులు గాలిగోపురం, కలశ ప్రతిష్టాపనలో పాల్గొనాలని, దాతలు నగదు, వస్తు రూపంలో సహాయ సహకారాలను అందించాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



కొల్లిపర: సీపీఎం ఆధ్వర్యంలో గుదిబండివారిపాలెంలోని జగనన్న కాలనీ వాసులు అంతర్గత రోడ్లు, మురుగుకాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలంటూ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మికి సీపీఎం నాయకులతో కలసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు లేకపోవటం వలన వర్షం నీరు బయటకు పోయే మార్గం లేక అక్కడ నిల్వ ఉండటం వలన ఏర్పడే బురదతో నడక నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు దోమలు, రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. దీనికితోడు వీధిలైట్లు సైతం లేవన్నారు. దీనిపై ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ కాలనీ వాసుల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాని తెలిపారు. సీపీఎం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, కాలనీ వాసులు శ్రీలత, దుర్గా రెహనా, పద్మ యశోద, ఏక్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్‌లో ఫార్మాసిస్టు దినోత్సవం

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో వరల్డ్ ఫార్మసిస్ట్ డేను ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ విద్యార్థులు తమ వృత్తి బాధ్యతలను గుర్తుచేసుకుంటూ, సమాజానికి అంకితభావంతో సేవ చేయాలనే సంకల్పం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫార్మసిస్ట్ ప్రమాణం స్వీకరించి, ఔషధాల సరఫరా, రోగుల ఆరోగ్యరక్షణ, వైద్య నిపుణుల సహకారం, నైతిక విలువలను కట్టుబడి పాటించాలనే ప్రతిజ్ఞ చేశారు. కాలేజి ప్రిన్సిపాల్ డా.కె.వెంకటరమణ మాట్లాడుతూ, ఫార్మసిస్ట్ వృత్తి ఆరోగ్య వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన భాగమని గుర్తుచేశారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.కోటిరెడ్డి, ఐపీఏ-ఎస్ఎఫ్, ఏఎస్ఎన్ చాప్టర్ మెంటార్ పి.భార్గవి, ఎన్ఎస్ఎస్ 1, 2 విభాగాల ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కళ్యాణ్ చక్రవర్తి పర్యవేక్షించారు.

పునరావాస కేంద్రం పరిశీలన

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో ఆర్డీవో రామలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా పెసర్లంక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, అలాగే భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు.


బాలుడి చికిత్సకు ఆర్థిక సాయం


తెనాలి: స్థానిక సుందరయ్యనగర్‌లో 11కేవీ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురైన తొమ్మిదేళ్ల బాలుడు బ్లెస్సింగ్‌పాల్‌కు వైద్యఖర్చుల నిమిత్తం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం తరఫున రూ.20 వేల ఆర్థికసహాయం అందజేశారు. ఇంటివద్ద ఆడుకుంటున్న బ్లెస్సింగ్ పాల్ తెగిపడిన 11కేవీ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. మంగళగిరి ఎయిమ్స్‌కు తీసుకెళ్లిన తల్లిదండ్రులు, ఆ తర్వాత అతడిని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రోటరీ క్లబ్ వాట్సాప్ గ్రూపులో పెట్టిన వినతికి స్పందించి రూ.20 వేల ఆర్థికసాయం పంపినట్టు క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ తెలియజేశారు. పట్టణ పౌరులు కూడా స్పందించి 9949662973 నంబరుకు తోచిన సాయం చేయాలని వారు విజ్ఞప్తిచేశారు.

ఉచిత వైద్య శిబిరం

తెనాలిరూరల్: ఫ్రూట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ‘కడవరి కాల సందేశం’ ఆధ్యాత్మిక మాస పత్రిక 26వ వార్షికోత్సవం సందర్భంగా పెదరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. పొన్నూరు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం లాజర్‌బాబును సత్కరించారు. ఫ్రూట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవ. తుమ్మల ప్రశాంత రాజు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సందీప్, డాక్టర్ బి.శ్యాంప్రసాద్, వి.ఝాన్సీ, సిహెచ్. నెహెమ్యా, డి.స్టీవెన్, సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గ సభ్యులు కె. రమేష్ కుమార్, బి.సుధాకర్, మార్కండేయులు, ఎం.శరీన్, వాణి, బ్లెస్సీ పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు


శ్రీరాజరాజేశ్వరీ దేవిగా నందివెలుగు కనకదుర్గమ్మ అమ్మవారు


మారీస్‌పేటలోని శ్రీచంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో..


ఎరుకలపూడిలో మహాగౌరీగా..


గంగానమ్మపేట పాతశివాలయంలో భద్రకాళి అలంకారం


వనదుర్గ సహిత నవచండీ హోమం


శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా వాసవీ అమ్మవారు

నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన గురువారం పట్టణంలోని శ్రీవాసవి అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా.. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు శ్రీమంగళగౌరీదేవిగా.. వివిధ ఆలయాల్లోని అమ్మవార్లు పలు అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తెనాలిలో వనదుర్గా సహిత నవ చండీహోమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

– తెనాలి, తెనాలి టౌన్


కొలకలూరులో శ్రీగాయత్రీ దేవిగా..


శ్రీఓంకారాశ్రమంలో శ్రీకాత్యాయనీ దేవిగా...

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: నేటి ఆధునిక జీవనంలో మహిళలకు అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అందరు అప్రమత్తంగా ఉండాలని తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎక్కువమందిలో కాన్సర్, వివిధ రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. సకాలంలో వీటిని గుర్తించటం వల్ల వ్యాధులు తగ్గే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ జి.నిహారిక, డాక్టర్ రాహుల్, డాక్టర్ బాలయ్య, డాక్టర్ వినోద్ బాబు, బీజేపీ నాయకులు డాక్టర్ అనంతాచార్యులు, అడపా సంపత్ రాయుడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, చింతల ప్రసన్న పుష్పలత, దాసరి విజయకుమారి, రవికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

రూరల్ మండలంలో...

తెనాలిటౌన్: స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రూరల్ మండల గ్రామంలోని మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి పైగా మహిళలు ఆరోగ్య సేవలు వినియోగించుకున్నారు. క్యాన్సర్ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు పరీక్షలు, పీఎంజే ఏవై నమోదు, టీబీ పరీక్షలు చేశారు. గ్రామ సర్పంచ్ కోపల్లె మన్నెమ్మ పాల్గొన్నారు. కొలకలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పరీక్షలు చేశారు.

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తెనాలిఅర్బన్: పట్టణ సుందరీకరణలో అందరు భాగస్వాములు కావాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం సచివాలయ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నాలుగోవ శానిటరీ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆప్రాంతంలో ఎక్కడ శానిటేషన్ సమస్యలు కన్పించకూడదన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు నెలరోజుల పాటు ఆ డివిజన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. తర్వాత పట్టణంలోని మిగిలిన డివిజన్లలో ఇదే విధంగా కార్యక్రమాలు నిర్వహిచనున్నట్లు వివరించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు మాట్లాడుతూ పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల సమస్య ఎక్కువగా ఉందన్నారు. స్థల యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యజమానులు తమ స్థలాలను వెంటనే బాగు చేయించుకోవాలని సూచించారు. ఏసీపీ వాణి, ఆర్వో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతను కాపాడాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె(చెరుకుపల్లి): పట్టణ ప్రజలు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరించే మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి పట్టణ పరిశుభ్రతను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వినాయకుడి గుడి ఏరియాలోని పోలీస్ క్వార్టర్స్ వద్ద గల చెత్త పాయింట్‌ను మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించి అక్కడ మహిళలతో ముగ్గులు వేయించి, చెత్తను బయట పారవేయకుండా మున్సిపల్ కార్మికులకు ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ వారానికి ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛ రేపల్లెకు పాటు పడి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, పట్టణ ఆదర్శ వేదిక అధ్యక్షుడు కిషోర్ బాబు, పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పరిశుభ్రతతో అంటు వ్యాధుల నివారణ

డీపీవో ప్రభాకరరావు

కర్లపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన అంటు వ్యాధులను నివారించగలుగుతామని డీపీవో కేఎల్ ప్రభాకరరావు తెలిపారు. కర్లపాలెంలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, కర్లపాలెం పంచాయతీ సిబ్బంది కర్లపాలెం సచివాలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రోడ్లకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. డీపీవో ప్రభాకరరావు మాట్లాడుతూ అన్ని పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత స్థానిక అధికారులపై ఉందని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పంచాయతీ సిబ్బంది పాల్గొని పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కర్లపాలెం గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి సునీత, సిబ్బంది పాల్గొన్నారు.


కర్లపాలెంలో రోడ్లు శుభ్రం చేస్తున్న డీపీవో ప్రభాకరరావు, అధికారులు

పండిట్ దీన్‌దయాళ్ జయంతి

తెనాలి: బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని జరిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కటారి వాసుదేవనాయుడు, బీజేపీ సీనియర్ కార్యకర్త పరుచూరి సురేష్‌లు, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు అలపర్తి రాఘవయ్య, కేవీ సత్యనారాయణ నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్ పర్యవేక్షించారు.

తెనాలిటౌన్: సేవా పక్వాడ-బీజేపీ తెనాలి సౌత్ మండల ఆధ్వర్యంలో గురువారం స్థానిక కార్యాలయం వద్ద స్వర్గీయ పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సంపత్ రాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ నాయకులు బిట్ర కనకదుర్గ, అన్నవరపు వేణు, మైలా హరి కృష్ణ, లక్ష్మణ్, కుశల్ రాజ్ జైన్, అభిమానులు పాల్గొన్నారు.

అంతర కళాశాలల కబడ్డీలో బాపట్ల విద్యార్థుల ప్రతిభ



బాపట్ల: చదువుతో పాటు క్రీడాల్లోనూ బాపట్ల కళాశాల విద్యార్థులు రాణిస్తున్నారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కళాశాలల విద్యార్థులు మొదటి రెండు బహుమతులను సాధించినందుకు గాను గురువారం వారికి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ముప్పలనేని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పారేపల్లి చంద్రశేఖర్, దొడ్డపనేని వెంకయ్యచౌదరి, అధ్యాపకులు మల్లిఖార్జునరావు, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

భట్టిప్రోలు: హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపకురాలు రెవరెండ్ లలిత కుమారి ఆశీస్సులతో అధినేత కత్తెర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 27న భట్టిప్రోలు కేఎస్‌కే కళాశాల క్యాంపస్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ సౌజన్యంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. హాస్పిటల్ 25వ వార్షికోత్సవం సందర్భంగా అడ్మిట్ అయిన పేషెంట్లకు అల్ట్రాసౌండ్, సీటీస్కాన్, ఎంఆర్ఐ, అన్ని రక్త పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భట్టిప్రోలు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెలవుల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

దుగ్గిరాల: వృత్తి విద్య ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ /జ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలతో పాటు సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని హెచ్.ఎం బి.వి.కృష్ణారావు అన్నారు. గురువారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. హెచ్ఎం బి.వి. కృష్ణారావు మాట్లాడుతూ ఈ తరగతులను వినియోగించుకోవాలని సూచించారు. టైలరింగ్ ట్రెనింగ్ అనుమతితో 10 రోజులు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రోచ్ అవస్థలు

దుగ్గిరాల: అప్రోచ్ రోడ్డుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మంచికలపూడి నుంచి కంఠంరాజుకొండూరు వెళ్లే డీఆర్‌బీసీ వంతెన నిర్మాణంలో ఉండగా పక్కగా అప్రోచ్ రోడ్డు వేశారు. ఇది గత వర్షాలకు బాగా దెబ్బతినంతో వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి వెళ్తున్నాయి. గురువారం సాయంత్రం ఇక్కడ ఓ కళాశాల బస్సు ఇరుక్కు పోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. గతంలో వర్షాలు పడినప్పుడు ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. దీని ఎత్తుపెంచి విస్తరిస్తే ఇబ్బందులు వచ్చేవి కావని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.